# పెన్ పవర్

9th HAPPY ANNIVERSARY

తెలుగు దిన పత్రిక

ప్రశ్నించడం మన హక్కు

సంవత్సరాల ప్రయాణం

సంపుటి : 10 సంచిక : 349 పేజీలు : 12 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : విశాఖపట్నం సోమవారం 2 సెప్టెంబర్ 2024 వెల : 5/-రూ॥

VOLUME :10 ISSUE : 349 PAGES : 12 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : VISAKHAPATNAM MON 2 SEPTEMBER 2024 PRICE : 5/- RS

Simultaneously Published form Visakhapatnam, Kakinada, Circulated by Srikakulam,Vizianagaram, Eluru,Vijayawada,Guntur, Prakasam,Nelloru,Chittur,YSR Kadapa, Kurnool, Anantapur




## ఎవరూ అధైర్య పడొద్దు ప్రభుత్వం అండగా ఉంటుంది

### విజయవాడలో వరద ముంపు ప్రాంతాలను బోటులో వెళ్లి పరిశీలించిన సీఎం చంద్రబాబు

- బుడమేరు ఉగ్రరూపం
- విజయవాడ సింగ్ నగర్, ఇతర ప్రాంతాలు నీట మునక
- వరద బాధితులకు ధైర్యం చెప్పిన సీఎం చంద్రబాబు
- ఎన్టీఆర్ జిల్లా కలెక్టరేట్ లో సమీక్ష

**పెన్ పవర్ డెస్క్:**కుండపోత వర్షాలతో విజయవాడ నగరం నీట మునిగింది. ఈ నేపథ్యంలో, సీఎం చంద్రబాబు వరద ముంపు ప్రాంతాలను బోటులో వెళ్లి పరిశీలించారు. బుడమేరు పొంగి ముంపునకు గురైన సింగ్ నగర్ ప్రాంతానిక వెళ్లి బాధితులను పరామర్శించారు. ఎవరూ అధైర్య పడొద్దని, తమ ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. తనను చూసి చేతులూపుతున్న వరద బాధితులను ఉద్దేశించి... "మీరేమీ బాధపడొద్దు... అన్నీ నేను చూసుకుంటాను" అంటూ సంజ్ఞల ద్వారా స్పష్టం చేశారు.
ఇక సింగ్ నగర్ లో గండి పూడ్చడంపై అధికారులతో మాట్లాడారు. ముందు, వరద బాధితులను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని చంద్రబాబు అధికారులను ఆదేశించారు. ప్రాణ నష్టం జరగకుండా నివారించాలని సూచించారు. అనంతరం, ఎన్టీఆర్ జిల్లా కలెక్టరేట్ కు వచ్చిన చంద్రబాబు... మంత్రులు,

వివరాలు 2లో..

### ఏపీలో వరద పరిస్థితులను అమిత్ షాకు ఫోన్ లో వివరించిన సీఎం చంద్రబాబు



- ఏపీలో కుండపోత వానలు
- విజయవాడ, గుంటూరు ప్రాంతాల్లో రికార్డు స్థాయిలో వర్షపాతం
- నీట మునిగిన విజయవాడ
- అన్ని రకాల సాయం అందిస్తామని చంద్రబాబుకు హామీ ఇచ్చిన అమిత్ షా

వివరాలు 2లో..

### కేరళ సీఎం ఏదో దాస్తున్నారు.. జేపీ నడ్డా సంచలన ఆరోపణలు



**పెన్ పవర్ డెస్క్:**మాలీవుడ్ లైంగిక వేధింపుల కేసులో జస్టిస్ హేమ కమిటీ నివేదికపై కేరళ ప్రభుత్వంపై మండి పడ్డారు బీజేపీ జాతీయ అధ్యక్షుడు ప్రకాష్ నడ్డా.. ఆదివారం (సెప్టెం బర్1) న కేరళలోని పాలక్కాడ్ లో జరిగిన ఓ కార్యక్రమంలో మాట్లాడిన నడ్డా..కేరళ ప్రభుత్వం జస్టిస్ హేమ కమిటీ నివేదికపై ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు.సీపీఎం

వివరాలు 2లో..

### మహబూబాబాద్ వరదల్లో చిక్కుకుపోయిన ఏపీ ఎమ్మెల్యే



**పెన్ పవర్ డెస్క్:**తెలంగాణ రాష్ట్రంలో భారీ వర్షాల కారణంగా ఆంధ్రప్రదేశ్ ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి మహబూబాబాద్ లో చిక్కుకుపోయారు. నెల్లూరు నుంచి సికింద్రాబాద్ కు మచిలీపట్నం ఎక్స్ప్రెస్ లో ఎమ్మెల్యే చంద్రమోహన్ రెడ్డి ప్రయాణిస్తున్నారు. భారీ వర్షాల వల్ల కేసముద్రం, నెక్కొండ మధ్యలో రైల్వే ట్రాక్ దెబ్బతింది. వరద నీటి ఉధృతికి రైల్వే ట్రాక్ కొట్టుకుపోయింది. దీంతో ఆ మార్గంలో ప్రయాణించే

వివరాలు 2లో..

### ప్రజలు మనవైపే ఉన్నారనే విశ్వాసం నాకు ఉంది

#### పులివెందులలో జగన్



- పులివెందుల పర్యటనలో ఉన్న జగన్
- ఎవరూ అధైర్య పడొద్దని పార్టీ శ్రేణులకు భరోసా ఇచ్చిన జగన్
- ఐదేళ్ల పాలనలో అన్నీ మంచి పనులు చేశామని వ్యాఖ్య

**పెన్ పవర్ డెస్క్:** పులివెందుల పర్యటనలో ఉన్న వైసీపీ అధినేత జగన్ ఈరోజు పార్టీ శ్రేణులతో మమేకమయ్యారు. పులివెందులలోని భాకరాపురంలో ఉన్న క్యాంపు కార్యాలయంలో పార్టీ నేతలు, కార్యకర్తలు, అభిమానులను కలిశారు. అందరినీ పేరుపేరునా పలకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఎవరూ అధైర్య పడొద్దని, అందరికీ పార్టీ అండగా ఉంటుందని

వివరాలు 2లో..

### పేర్ని నానికి ఘోర అవమానం.. కోడిగుడ్లు విసిరిన జనసైనికులు!

- గుడివాడలోని తోట శివాజీ ఇంటికి వెళ్లిన పేర్ని నాని
- పవన్ కు క్షమాపణలు చెప్పాలంటూ జనసైనికుల ఆందోళన
- పేర్ని నాని వాహనంపై దాడి



**పెన్ పవర్ డెస్క్:** వైసీపీ సీనియర్ నేత, మాజీ మంత్రి పేర్ని నానికి ఘోర అవమానం ఎదురైంది. ఆయనపై కొందరు యువకులు కోడిగుడ్లు విసిరారు.

వివరాలు 2లో..

## ఏపీలో 4 జిల్లాలకు రెడ్ అలర్ట్... 3 జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్



- ఏపీలో మరో 24 గంటల పాటు భారీ వర్షాలు
- గుంటూరు, ఎన్టీఆర్, పల్నాడు, ప్రకాశం జిల్లాలకు రెడ్ అలర్ట్
- బాపట్ల, కృష్ణా, ఏలూరు జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్

వివరాలు 2లో..

## మిషన్ భగీరథ పెద్ద అవినీతి స్కీమ్

- కాంట్రాక్టర్లు దోచుకునేందుకే కేసీఆర్ తెచ్చిండ్రు
- పేదలు మురికి నీళ్లు తాగడానికి కేసీఆర్ కారణం

మందమర్రి మున్సిపాలిటీ వార్డులో మార్నింగ్ వాక్ లో చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి కోల్బెల్ట్ :

వివరాలు 2లో..



## 'సెలవులు రద్దు చేసుకోండి'..

### అధికారులకు CM రేవంత్ కీలక ఆదేశాలు



హైదరాబాద్: అత్యవసరం అయితే తప్ప ప్రజలు ఎవరూ ఇండ్ల నుండి బయటకు రావొద్దని సీఎం రేవంత్ రెడ్డి సూచించారు. గత మూడు రోజులుగా రాష్ట్రంలో భారీ వర్షాలు కురుస్తోన్న నేపథ్యంలో వర్షాలపై సీఎం రేవంత్ రెడ్డి (ఆదివారం) అత్యవసర సమావేశం

వివరాలు 2లో..

## ఆగస్టులో రూ.1,74,962 కోట్ల జీఎస్టీ వసూలు

- ఆగస్టు మాసం జీఎస్టీ వసూళ్ల వివరాలు ఇవిగో!
- గతేడాది ఆగస్టుతో పోల్చితే 10 శాతం వృద్ధి
- ఈ ఏడాది ఆగస్టు వరకు నికర జీఎస్టీ ఆదాయం రూ.8.07 లక్షల కోట్లు

ఆగస్టు నెల జీఎస్టీ వసూళ్ల వివరాలను కేంద్రం నేడు విడుదల చేసింది. ఆగస్టులో రూ.1,74,962 కోట్ల జీఎస్టీ వసూలైనట్టు కేంద్ర ఆర్థిక శాఖ వెల్లడించింది. గతేడాది ఆగస్టుతో పోల్చితే 10 శాతం వృద్ధి నమోదైందని తెలిపింది. 2023 ఆగస్టులో

వివరాలు 2లో..




## భారీ వర్షాల సమీక్షల కారణంగా బాలయ్య కార్యక్రమానికి హాజరు కాలేకపోతున్నా

- నందమూరి బాలకృష్ణ సినీ కెరీర్ కు 50 ఏళ్లు
- హైదరాబాదులో గోల్డెన్ జూబ్లీ వేడుక
- ముఖ్య అతిథిగా హాజరు కావాల్సిన ఏపీ సీఎం చంద్రబాబు
- ఏపీలో భారీ వర్షాలు, వరదలు... సమీక్షలతో చంద్రబాబు బిజీ

హైదరాబాదులో నందమూరి బాలకృష్ణ గోల్డెన్ జూబ్లీ వేడుక ప్రారంభమైంది. బాలయ్య సినీ కెరీర్ కు 50 ఏళ్లు నిండిన నేపథ్యంలో, ఈ స్వర్ణోత్సవ కార్యక్రమం ఏర్పాటు చేశారు. వాస్తవానికి ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు హాజరు కావాల్సి ఉంది.
అయితే ఏపీలో భారీ వర్షాలు, వరదల కారణంగా చంద్రబాబు పరిస్థితిని

వివరాలు 2లో..



# సంపాదకీయం

## కొబ్బరితో కోరినన్ని లాభాలు.. కొన్ని ఇంట్రెస్టింగ్ సంగతులు ఇవి...

కొబ్బరి చెట్టుని కల్పవృక్షం అని గౌరవంగా పిలుస్తారు. ఎందుకంటే ఆ చెట్టు వల్ల బోలెడు ఉపయోగాలు ఉన్నాయి. ఒక్కమాటలో చెప్పాలంటే కొబ్బరి నీళ్ల దగ్గర నుంచి పీచు వరకు ఎన్నో రకాల లాభాలున్నాయి. అటు ఆరోగ్యం, ఇటు సంపదకు తోడ్పడుతుంది. అలాంటి కొబ్బరి గురించి అవగాహన కల్పించేందుకు ప్రతి ఏటా సెప్టెంబర్ 2వ తేదీన 'వరల్డ్ కోకోనట్ డే' చేస్తారు. ఆ సందర్భంగా కొబ్బరి గురించి కొన్ని ఇంట్రెస్టింగ్ సంగతులు ఇవి.

ప్రపంచంలో అత్యధికంగా కొబ్బరి ఉత్పత్తి కేంద్రాలను కలిగి ఉన్న ఆసియా, పసిఫిక్ ప్రాంతాలకు సంబంధించిన దేశాల్లో ఈ కోకోనట్ డే సెలబ్రేట్ చేస్తారు. కొబ్బరి వల్ల ఎన్నో ఆరోగ్యప్రయోజనాలు ఉన్నాయని తెలియజేయడమే ఈ డే వెనక ఉన్న ఉద్దేశం. మొదటిసారి 2009 సంవత్సరంలో వరల్డ్ కోకోనట్ డే జరిగింది. ఇండోనేసియా రాజధాని జకార్తాలో ఉన్న ఏసియన్ పసిఫిక్ కోకోనట్ కమ్యూనిటీ (ఏపీసీసీ) ఈ డేని మొదలుపెట్టింది. ప్రతి ఏటా ఒక థీమ్‌తో ఈ రోజుని సెలబ్రేట్ చేస్తారు. ఈ ఏడాది థీమ్%–% 'కోకోనట్ ఫర్ సర్క్యులర్ ఎకానమీ : బిల్డింగ్ పార్ట్‌నర్ షిప్ ఆఫ్ మ్యాగ్జిమమ్ వ్యాల్యూ'.

**మూడో స్థానంలో భారత్**

కొబ్బరి చెట్టులో కాండం, కాయలు, ఆకులు, కొబ్బరి నీళ్లు, పీచు, కొబ్బరి పాలు, నూనె ఇలా ఒకటేంటి ఎన్నో రకాలుగా ఉపయోగపడుతుంది. మరి ఈ కొబ్బరి పరిస్థితి మనదేశంలో ఎలా ఉంది? అన్ని కాలాల్లోను పంట ఇచ్చే చెట్టు కొబ్బరి చెట్టు. ప్రపంచదేశాల్లో కొబ్బరి ఉత్పత్తిలో భారతదేశం మూడో స్థానంలో ఉంది. కొబ్బరి డెవలప్ మెంట్ బోర్డుమద్దతుతో కేరళ, తమిళనాడు, కర్నాటక, గోవా, పశ్చిమ బెంగాల్, ఆంధ్రప్రదేశ్, ఒడిశా తదితర రాష్ట్రాల్లో కోకోనట్ డే సెలబ్రేట్ చేస్తారు. అందులో భాగంగా కొబ్బరి ఉత్పత్తిని పెంచడానికి, వాడకానికి సంబంధించి ఎక్స్‌పర్ట్స్‌తో ప్రచార కార్యక్రమాలు చేస్తారు. కొబ్బరి ఉత్పత్తుల గురించి ఆలోచనలు ఒకరితో ఒకరు పంచుకుంటారు.

**ఆరోగ్య ప్రయోజనాలు**

**పచ్చి కొబ్బరి :** పచ్చి కొబ్బరి తినడం వల్ల డయాబెటిస్ దరిచేరదు. నిద్రలేమి, థైరాయిడ్ సమస్యలకు చెక్ పెడుతుంది. పలు రకాల క్యాన్సర్లతో పచ్చి కొబ్బరి పోరాడుతుంది. ఇందులో ఎక్కువగా ఉండే సెలీనియం, మెగ్నీషియం హ్యాపీ హార్మోన్ల ఉత్పత్తిని పెంచి, ఒత్తిడిని తగ్గిస్తాయి. గ్యాస్, ఎసిడిటీ, అజీర్ణం, మలబద్ధకం సమస్యల నుంచి రిలీఫ్ ఇస్తుంది. జుట్టు, చర్మ సంరక్షణకు మేలు చేస్తుంది.

**ఎండు కొబ్బరి :** ఇందులో ఉండే ప్రొటీన్స్, విటమిన్స్, ఐరన్, క్యాల్షియం, మాంగనీస్, సెలీనియం రోగ నిరోధక శక్తిని పెంచుతాయి. వివిధ వైరల్ ఇన్ఫెక్షన్‌లు, చర్మ సమస్యల నుంచి రక్షిస్తాయి. ఎముకలు బలంగా తయారవుతాయి. మానసిక ఆరోగ్యం మెరుగుపడుతుంది. అల్జీమర్స్ రాకుండా సాయపడుతుంది. రక్తహీనత సమస్య తగ్గుతుంది. చర్మాన్ని హైడ్రేటెడ్‌గా ఉంచుతుంది. సంతానలేమి సమస్యకు చెక్ పెడుతుంది!

**కొబ్బరి నూనె :** బరువు తగ్గడానికి సాయపడుతుంది. మెదడు పనితీరును మెరుగుపరుస్తుంది. శీతాకాలంలో శరీరం పొడిబారకుండా కొబ్బరి నూనె రాసుకుంటే మంచి ఫలితం ఉంటుంది. అంతేకాదు.. హానికారక క్రిములు చర్మానికి హాని కలిగించకుండా షీల్డ్‌లా ఉంటుంది.

**కొబ్బరి నీళ్లు :** కిడ్నీల్లో రాళ్లను కరిగించే శక్తి కొబ్బరి నీళ్లకు ఉంది. ఇన్‌స్టంట్ ఎనర్జీ ఇస్తాయి. రక్తపోటు అదుపులో ఉంటుంది. గుండె సంబంధిత వ్యాధులు తగ్గుతాయి. చక్కెర స్థాయిల్ని కంట్రోల్ చేస్తాయి. ఇమ్యూనిటీ పెరుగుతుంది. ప్రెగ్నెన్సీలో డైజెషన్‌కి మేలు చేస్తుంది. ఎముకలు దృఢంగా తయారవుతాయి. కండరాల తిమ్మిరి నుంచి రిలీఫ్ వస్తుంది. రక్తప్రసరణ మెరుగుపడుతుంది. కాళ్లు, చేతుల వాపు తగ్గిస్తాయి.

ఇవేకాకుండా మరెన్నో ప్రయోజనాలు ఉన్నాయి. కాబట్టి కొబ్బరిని ఏదో ఒక రూపంలో తరచూ తీసుకోవడం వల్ల ఆరోగ్యానికి మేలు కలుగుతుంది. కాకపోతే పోషకాహార నిపుణుల సలహా తీసుకుని మొదలుపెడితే అసలు ప్రయోజనాలు శరీరానికి అందుతాయి.

**కొబ్బరి నేల..కేరళ!**

కేరళ అనగానే కొబ్బరి చెట్లు, కొబ్బరి నూనెతో చేసే వంటలు గుర్తొస్తాయి. అంతెందుకు కేరళ అనే పేరు కూడా కొబ్బరి అనే అర్థాన్నిస్తుంది. "కేరా" అంటే కొబ్బరి, "ఆలం" అంటే నేల అని అర్థం. ఈ రెండు పదాల కలయికే కేరళ. కేరళ అంటే కొబ్బరి నేల అన్నమాట అదే ఇంగ్లిష్‌లో అయితే 'ల్యాండ్ ఆఫ్ కోకోనట్స్'.

**ఉపాధి కల్పిస్తోంది**

కొబ్బరి చెట్టులోని ప్రతి భాగం ఉపయోగపడుతుంది. కాబట్టి కొబ్బరిని అనేక రకాలుగా వాడేందుకు రకరకాల పరిశ్రమలు కూడా వెలిశాయి.

**ఫుడ్ ఇండస్ట్రీ :** మలయాళ వంటల్లో ఇంపార్టెంట్ ఇంగ్రెడియెంట్ కొబ్బరి. లేత కొబ్బరి నీళ్లు కేరళలో ఎక్కువగా తాగుతారు. కొబ్బరి నూనెను వంట నూనెగా వాడతారు. పచ్చి లేదా ఎండు కొబ్బరి, కొబ్బరి పాలు వాడకుండా వంట పూర్తవ్వదు కేరళలో.

**కొయర్ ఇండస్ట్రీ :** 'కొయర్' అనే పేరు మలయాళ పదం "కయార్" నుంచి వచ్చింది. కొయర్ అంటే కొబ్బరి పీచు అని అర్థం. భారతదేశంలో, కొయర్ ఇండస్ట్రీని1859లో మొదటిసారి ఐరిష్‌కు చెందిన జేమ్స్ డర్రఫ్ అలెప్పీలో మొదలుపెట్టాడు. కొబ్బరి పీచును కేరళలో 'గోల్డెన్ ఫైబర్' అని పిలుస్తారు. ఇది ఎకోఫ్రెండ్లీ ప్రొడక్ట్ కూడా. కొయర్ పరిశ్రమ కేరళలో అతిపెద్ద కుటీర పరిశ్రమ.

**క్రాఫ్ట్ ఇండస్ట్రీ :** వివిధ చేతిపనుల తయారీకి కొబ్బరి చిప్ప వాడతారు. కొబ్బరి చిప్పతో చేసిన గరిటెలు, స్పూన్లు కేరళలో ప్రతి ఇంట్లో ఉంటాయి. పెన్ స్టాండ్, హోల్డర్, లైట్లు మొదలైనటువంటి వస్తువులు తయారుచేసేందుకు కూడా దీన్ని వాడతారు.

# మిషన్ భగీరథ పెద్ద అవినీతి స్కీమ్

- మొదటి పేజీ తరువాయి

కేసీఆర్ మిషన్ భగీరథ స్కీమ్ను పదేళ్లు కాంట్రాక్టర్లకు దోచిపెట్టేందుకే అమలు చేసిందని చెన్నూరు వివేక్ వెంకటస్వామి ఆరోపించారు. ఇవాళ మంచిర్యాల జిల్లా మందమర్రి మున్సిపాలిటీలోని 1,2,22 వార్డుల పరిధిలోని యాపల్, వార్డుల్లో రోడ్లు, డ్రైనేజీల నిర్మాణానికి కృషి అబ్రహాంనగర్, సింగరేణి జీఎం ఆఫీస్ ఏరియాల్లో నిర్వహించిన మార్నింగ్ వాక్ లో ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి, మాజీ ఎమ్మెల్యే నల్లాల ఓదెలు పా ల్గొన్నారు. ఈ సందర్భంగా స్థానికుల నుంచి సమ స్యలు అడిగితెలుసుకున్నారు. సమస్య పరిష్కారా నికి చర్యలు తీసుకోవాలని సంబంధిత ఆఫీసర్లను ఎమ్మెల్యే వివేక్ ఆదేశించారు. యాపల్ లో కాలనీ వాసులు తమకు మిషన్ భగీరథ ద్వారా మురికి, వాసనతో కూడిన నీళ్లు వస్తున్నాయని, బాటిల్స్ లో పట్టిన వాటర్ ను ఎమ్మెల్యేకు చూపించారు.

ఈ సం దర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ చాలా కాలంగా తాను మిషన్ భగీరథ ఒక పెద్ద అవినీతి స్కీమ్ అని చెప్తున్నానని, ఎక్కడ కూడా నీళ్లు సరిగా రావ డంలేదన్నారు. మురికి, వాసనతో కూడిన నీళ్లను ప్రజలు ఎలా తాగుతారని ఆయన ప్రశ్నించారు. కేసీఆర్ సర్కార్ కేవలం కమిషన్ల కోసం, కాంట్రాక్టర్లకు దోచిపెట్టేందుకు ఈ స్కీం తీసుకువచ్చింది, తాగునీటి కోసం రూ. 30 కోట్లతో మందమర్రి మున్సిపాలిటీ ప్రజలు కష్టాలు దూరం చేసేందుకు కొత్తగా వాటర్ స్కీంను తీసుకువస్తం. దీంతో ప్రతిఇంటికి స్వచ్ఛమైన తాగునీటిని అందిస్తం. ఈ నెల ఫస్ట్ వీక్ లోనే స్కీం పనులను భూమిపూజ చేస్తామని ఎమ్మెల్యే వివేక్వెంకటస్వామి తెలిపారు.

**వార్డుల్లో రోడ్లు, డ్రైనేజీల నిర్మాణానికి కృషి**

మందమర్రి మున్సిపాలిటీ పరిధిలోని వార్డుల్లో పదేండ్లుగా ఎలాంటి అభివృద్ధి జరుగలేదని చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి అన్నారు. సైడ్ డ్రైనేజీలు, రోడ్లు, తాగునీటి సౌలత్లు లేక స్థానిక ప్రజలు ఏళ్లుగా ఇబ్బందులు పడుతున్నట్లు చెప్పారు. సైడ్ డ్రైన్స్, రోడ్ల నిర్మాణానికి ప్రత్యేక ఫండ్స్ కేటాయిస్తు న్నట్లు చెప్పారు. కాలనీలో సులబా కాంప్లెక్, బస్ స్టాఫ్ నిర్మాణానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. దోమల నివారణకు తరచూ వార్డుల్లో ఫాగింగ్ చేయించాలని మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లును ఆదేశించారు. యాపల్ ఏరియాలోని బస్తీ దవాఖాన లో మందుల కొరత, సరిగ్గా డాక్టర్లు రాకపోవ డంపై స్థానికులు ఎమ్మెల్యేకు కంప్లైట్ చేశారు. సమస్య పరిష్కారానికి సంబంధిత డాక్టర్లతో ఆయన మాట్లాడారు. అబ్రహాం నగర్ ప్రాంతంలో కమ్యూనిటీ హాల్ ఏర్పాటు స్థలం కావాలని స్థానికులు కోరాగా ఇందుకు స్పందించిన ఎమ్మెల్యే వెంటనే సింగరేణి జీఎం దేవేందర్ తో ఫోన్లో మాట్లాడి కమ్యూనిటీ హాల్ కోసం స్థలాలు కేటాయించాలని ఆదేశించారు. మందమర్రి మున్సిపాలిటీ అభివృద్ధి పథంలోకి తీసుకువస్తానని, ఒక్కొక్కటిగా ప్రియారిటీ పరంగా అభివృద్ధి పనులు చేస్తామన్నారు.

# పేర్ని నానికి ఘోర అవమానం.. కోడిగుడ్లు విసిరిన జనసైనికులు!

- మొదటి పేజీ తరువాయి

వివరాల్లోకి వెళితే ఈరోజు పేర్ని నాని గుడివాడలోని తోట శివాజీ ఇంటికి వచ్చారు. ఈ విషయం తెలుసుకున్న జనసేన కార్యకర్తలు, పవన్ అభిమానులు అక్కడకు వచ్చారు. తోట శివాజీ ఇంటి ముందు పేర్ని నానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ, ఆందోళనకు దిగారు. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పై చేసిన వ్యాఖ్యలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా అక్కడ ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఈ క్రమంలో తీవ్ర ఆగ్రహానికి గురైన జనసైనికులు పేర్ని నానిపై ఒక్కసారిగా కోడిగుడ్లు విసిరారు. ఈ ఘటనతో ఆయన షాక్ కు గురయ్యారు. మరికొందరు పేర్ని నాని కారును ధ్వంసం చేసేందుకు ప్రయత్నించారు. ఈ దాడిలో నాని కారు అద్దాలు పగిలాయి. అలర్ట్ అయిన పోలీసులు జనసైనికులను అదుపు చేశారు. పలువురిని అదుపులోకి తీసుకున్నారు. ఈ క్రమంలో జనసైనికులకు, పోలీసులకు మధ్య ఘర్షణ వాతావరణం నెలకొంది.

మరోవైపు ఘర్షణ సందర్భంగా పేర్ని నానికి జనసైనికులు సీరియస్ వార్నింగ్ ఇచ్చారు. పవన్ కు క్షమాపణ చెప్పేంత వరకు గుడివాడ దాటి వెళ్లనివ్వబోమని హెచ్చరించారు. చెప్పులు చూపిస్తూ వార్నింగ్ ఇచ్చారు. మహిళలను కించపరిచేలా సోషల్ మీడియాలో పోస్టులు పెట్టే వ్యక్తిని పరామర్శించేందుకు పేర్ని నాని గుడివాడకు రావడం సిగ్గుచేటని విమర్శించారు. గతంలో రెండు చెప్పులతో పవన్ ను పేర్ని నాని అవమానించారని... ఇప్పుడు 36 చెప్పులు రెడీగా ఉన్నాయని అన్నారు. ఈ క్రమంలో, అక్కడి నుంచి పోలీసుల అండతో పేర్ని నాని వెళ్లిపోయారు.

## ఏపీలో వరద పరిస్థితులను అమిత్ షాకు ఫోన్ లో వివరించిన సీఎం చంద్రబాబు

**పెన్ పవర్ డెస్క్:**ఏపీ సీఎం చంద్రబాబు రాష్ట్రంలో భారీ వర్షాలు, వరద పరిస్థితులను కేంద్ర హోంమంత్రి అమిత్ షాకు తెలియజేశారు. అమిత్ షాతో ఫోన్ లో మాట్లాడిన చంద్రబాబు వరద సహాయ చర్యలను వివరించారు. వరద ముంపు ప్రాంతాల్లో సహాయ చర్యల కోసం... ఎన్డీఆర్ఎఫ్ బృందాల ద్వారా పవర్ బోట్లు పంపాలని అమిత్ షాను కోరారు. ఈ సందర్భంగా అమిత్ షా సానుకూలంగా స్పందించారు. కేంద్రం నుంచి అవసరమైన అన్ని రకాల సాయం చేస్తామని చంద్రబాబుకు హామీ ఇచ్చారు. హోంశాఖ కార్యదర్శి ద్వారా తక్షణ సాయం అందేలా చూస్తామని అమిత్ షా స్పష్టం చేశారు.

# ప్రజలు మనవైపే ఉన్నారనే విశ్వాసం నాకు ఉంది

- మొదటి పేజీ తరువాయి

భరోసా ఇచ్చారు. ఐదేళ్ల పాలనలో మనం అన్నీ మంచి పనులు చేశామని... మనం చేసిన మంచి ప్రతి కుటుంబంలో ఉందని చెప్పారు.

ప్రజలు మనవైపే ఉన్నారనే విశ్వాసం తనకు ఉందని అన్నారు. ప్రభుత్వ తప్పిదాలను ఎత్తిచూపుతూ, ప్రజల సంక్షేమం కోసం పోరాటం చేద్దామని చెప్పారు. కార్యకర్తలకు అండగా నేతలు నిలబడాలని పిలుపునిచ్చారు.

# ఎవరూ అధైర్య పడొద్దు ప్రభుత్వం అండగా ఉంటుంది

- మొదటి పేజీ తరువాయి

ఎమ్మెల్యేలు, అధికారులతో సమీక్ష నిర్వహించారు.

వరద బాధితుల కష్టాలు తీర్చేంత వరకు విశ్రమించేది లేదని దిశానిర్దేశం చేశారు. పాలు, ఆహారం, నీళ్లు, కొవ్వొత్తులు, టార్చి లైట్లు తెప్పించి, బాధితులకు పంపిణీ చేయాలని ఆదేశించారు. లక్ష మందికి సరిపోయే ఆహారం సిద్ధం చేయాలని, బాధితులకు సరఫరా చేయాలని స్పష్టం చేశారు.

మొదట, అందుబాటులో ఉన్న ప్యాకేజ్డ్ ఫుడ్ వెంటనే పంపిణీ చేయాలని తెలిపారు. విజయవాడలో ఉన్న అన్ని షాపుల నుంచి వాటర్ బాటిళ్లు తెప్పించాలని పేర్కొన్నారు. ఆహారం గురించి అక్షయ పాత్ర,

ఇతర ఏజెన్సీలను సంప్రదించాలని, ఖర్చు గురించి ఆలోచన చేయొద్దని తేల్చి చెప్పారు. బుడమేరకు ఊహించని స్థాయిలో వరద రావడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందుల్లో ఉన్నారని, ప్రతి ఒక్క బాధితుడికి సాయం అందిద్దాం అని అధికారులకు నిర్దేశించారు.

## భారీ వర్షాల సమీక్షల కారణంగా బాలయ్య కార్యక్రమానికి హాజరు కాలేకపోతున్నా

- మొదటి పేజీ తరువాయి

సమీక్షించడంలోనూ, వరద ముంపు ప్రాంతాల్లో పర్యటనలతోనూ బిజీగా ఉన్నారు. దాంతో, ఈ కార్యక్రమానికి రాలేకపోతున్నాంటూ ఓ సందేశాన్ని సోషల్ మీడియాలో పంచుకున్నారు. "సినీ రంగ ప్రవేశ స్వర్ణోత్సవ వేడుకలను జరుపుకుంటున్న ప్రముఖ సినీ నటుడు, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణకు శుభాకాంక్షలు. ఏపీలో భారీ వర్షాల కారణంగా తలెత్తిన సమస్యల పరిష్కారంలో నిమగ్నమై ఉన్నందున... హైదరాబాదులో జరుగుతున్న కార్యక్రమానికి హాజరు కాలేకపోతున్నాను. నందమూరి బాలకృష్ణ మరెన్నో విజయాలు సాధించాలని, తెలుగు చిత్రసీమలో ఆయన పేరు చిరస్థాయిగా నిలిచిపోయేలా మరిన్ని పాత్రలు పోషించాలని మనస్ఫూర్తిగా ఆకాంక్షిస్తున్నాను" అంటూ చంద్రబాబు ట్వీట్ చేశారు.

# 'సెలవులు రద్దు చేసుకోండి'..

- మొదటి పేజీ తరువాయి

నిర్వహించారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతో పాటు పలువురు మంత్రులతో ఫోన్ లో మాట్లాడి ప్రస్తుత పరిస్థితిపై ఆరా తీశారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు. భారీ వర్షాల పట్ల అప్రమత్తంగా ఉండాలని.. సీఎస్, డీజీపీ, రెవిన్యూ, ఇరిగేషన్, విద్యుత్, హైడ్రా అధికారులు 24 గంటలు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. జిల్లా కలెక్టర్లు, ఎస్పీలు, రెవిన్యూ, ఇరిగేషన్, మున్సిపల్ శాఖ అధికారులు క్షేతస్థాయిలో పర్యటించాలన్నారు. రాష్ట్రంలో కుండపోత వర్షాలు కురుస్తోన్న నేపథ్యంలో అధికారులు సెలవులు రద్దు చేసుకోవాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో తక్షణమే సహాయక చర్యలు ప్రారంభించాలని సూచించారు.

వరదలు, సహాయక చర్యల సమాచారాన్ని ఎప్పటికప్పుడు సీఎంవోకు పంపాలని అధికారులకు చెప్పారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు అధికారులకు ఫోన్లో సమాచారం ఇవ్వాలన్నారు. ప్రజాప్రతినిధులు స్థానికంగా ఉంటూ సహాయక చర్యల్లో పాల్గొనాలని సూచించారు. కాంగ్రెస్ కార్యకర్తలు సహాయక కార్యక్రమాల్లో పాల్గొనాలని ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు.

# ఆగస్టులో రూ.1,74,962 కోట్ల జీఎస్టీ వసూలు

- మొదటి పేజీ తరువాయి

రూ.1,59,069 కోట్ల జీఎస్టీ వసూలైనట్టు వివరించింది.

ఆగస్టులో దేశీయ లావాదేవీల ద్వారా రూ.1.25 లక్షల కోట్లు, దిగుమతుల ద్వారా రూ.49,976 కోట్లు వసూలైనట్టు కేంద్రం పేర్కొంది.

కాగా, ఈ ఏడాది జులైలో రూ.1,82,075 కోట్ల జీఎస్టీ వసూలైంది. ఈ ఏడాది ఆగస్టు వరకు నికర జీఎస్టీ ఆదాయం రూ.8.07 లక్షల కోట్లు కాగా, గతేడాదితో పోల్చితే ఇది 10.2 శాతం ఎక్కువ.

# కేరళ సీఎం ఏదో దాస్తున్నారు.. జేపీ నడ్డా సంచలన ఆరోపణలు

- మొదటి పేజీ తరువాయి

నేత ప్రమేయం ఉన్నందున సీఎం పినరయి విజయ్ ఏదో దాస్తున్నారని ఆరోపించారు. మాలీవుడ్ లైంగిక వేధింపుల కేసులో కమ్యూ నిస్టు పార్టీ వ్యక్తుల ప్రమేయం ఉందని హేమా కమిటీ చాలా స్పష్టం గా చెప్పిందన్నారు. మాలివుడ్ సినీ ఇండస్ట్రీలో మహిళా ఆర్టిస్టులు ఎదుర్కొంటున్న లైంగిక వేధింపులపై విచారణ చేపట్టిన జస్టిస్ హేమ కమిటి నివేదిక అనేక విషయాలను బయట పెట్టింది. లేడీ ఆర్టిసుల వేధింపుల కేసులో కమ్యూనిస్టు పార్టీ వ్యక్తుల ప్రమేయం ఉందని జస్టిస్ హేమ కమిటి నివేదికలో స్పష్టం చేసిందన్నారు బీజేపీ అధ్యక్షుడు నడ్డా.

ఆగస్ట్19న నివేదిక విడుదలైన తర్వాత వివిధ మహిళలు లైంగిక వేధింపులకు పాల్పడినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న నటీనటులు, దర్శకులు, ప్రొడక్షన్ కంట్రోలర్లు మొదలైన

మలయాళ సినీ ప్రముఖులపై ఇప్పటివరకు కనీసం 10 కేసులు నమోదయ్యాయి. దర్శకులు వీకే ప్రకాష్, రంజిత్, నటులు సిద్ధిఖీ, ముఖేష్, జయసూర్య, మణియంపిల్ల రాజు, ఇడవెల బాబు, అడ్వకేట్ చంద్రశేఖరన్, ప్రొడక్షన్ కంట్రోలర్లు నోబుల్, విచ్‌లపై లైంగిక ఆరోపణలు వచ్చాయి.

# మహబూబాబాద్ వరదల్లో చిక్కుకుపోయిన ఏపీ ఎమ్మెల్యే

- మొదటి పేజీ తరువాయి

రైళ్లు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. మహబూబాద్ రైల్వే స్టేషన్లో మచిలీపట్నం ఎక్స్ ప్రెస్ నిలిపివేయడంతో ఎమ్మెల్యే చంద్రమోహన్ రెడ్డి అక్కడే చిక్కుకుపోయారు.

వెంటనే ఆయన మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావుకు సమాచారం ఇచ్చారు. మహబూబాబాద్ లో స్థానికంగా ఓ నేత ఇంట్లో ఎమ్మెల్యే సోమిరెడ్డికి బస ఏర్పాటు చేశారు. అక్కడి నుంచి మహబూబాబాద్ లో రోడ్డు మార్గంలో ఆయన హైదరాబాద్ కు చేరుకుంటారు.

## ఏపీలో 4 జిల్లాలకు రెడ్ అలర్ట్... 3 జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్

**పెన్ పవర్ డెస్క్:**కుండపోత వర్షాలతో ఏపీ అతలాకుతలం అయింది. మరో 24 గంటల పాటు రాష్ట్రంలో భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరించింది. నాలుగు జిల్లాలకు రెడ్ అలర్ట్, మూడు జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ ప్రకటించింది. గుంటూరు, ఎన్టీఆర్, పల్నాడు, ప్రకాశం జిల్లాలకు రెడ్ అలెర్ట్ జారీ చేసింది. బాపట్ల, కృష్ణా, ఏలూరు జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ ప్రకటించింది. తీరం వెంబడి 45 నుంచి 55 కిలోమీటర్ల వేగంతో గాలులు వీస్తాయని తెలిపింది. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించింది.


మరోవైపు, విజయవాడలోని సింగ్ నగర్ లో పరిస్థితి దారుణంగా ఉంది. వరద దాటే ప్రయత్నం చేసిన ఓ మహిళ... నీటిని దాటుతూ గుండెపోటుతో మృతి చెందింది. మృతదేహాన్ని తరలించలేక స్థానికులు కారుపై పెట్టారు. ఈ విషాదకర ఘటన గంగానమ్మ గుడి ఎదురుగా మసీదు రోడ్డులో చోటుచేసుకుంది. మొత్తం జలమయం కావడంతో సింగ్ నగర్ లో జనజీవనం స్తంభించింది.

# యువ సైంటిస్టును బలి తీసుకున్న ఆకేరు వాగు

భవిష్యత్తుపై ఎన్నో ఆశలు.. ఎన్నో ఆకాంక్షలు..వ్యవసాయ కుటుంబం నుంచి శాస్త్రవేత్తగా ఎదిగింది.. పదిమందికి అన్నం పెట్టే శాస్త్రవేత్తగా రాణించాలని రేయింబ వళ్లు కష్టపడింది..అనుకున్న స్థాయికి చేరువలో ఉంది..ఇంతలో..అనుకోని సంఘటన..ఆమె కన్నకలలను చుట్టుముట్టిన వరదనీటిలో తుడిచిపెట్టుకుపోయాయి. మహబూబాబాద్ జిల్లా ఆకేరు వాగు ఉధృతికి కారు కొట్టుకుపోయిన ప్రమాదంలో మరణించిన అశ్విని విషాద గాథ..


తండ్రి మోతీలాల్ లో కలిసి కారులో వెళ్తున్న అశ్వినీ.. ఆకేరు వాగు వరద ఉధృతికి బలైంది. చుట్టుముట్టిన వరద నీరు కారును ముంచేశాయి. మృత్యువు ముంచు కొస్తున్నపుడు అశ్విని బంధువులకు ఫోన్ చేసిన కన్నీ పర్యంతం అయింది. అయినా జరగాల్సిందంతా జరిగిపోయింది. వరదలో కొట్టుకుపోయి ఓ చెట్టుకు చిక్కుని శవమై కనిపించింది. తండ్రీ జాడ ఇంకా తెలియలేదు.

ఖమ్మం జిల్లా కారేపల్లి మండలం గంగారాం తండా చెందిన అశ్వినీ.. డిగ్రీ , పీజీల్లో గోల్డ్ మెడల్ సాధించింది. వ్యవసాయ కుటుంబం నుంచి వచ్చిన అశ్వినీ పట్టుదల తో.. ఉన్నత శిఖరాలకు ఎదిగింది. అశ్వారావు పేట వ్యవసాయ కళాశాలలో అగ్రికల్చర్ బీఎస్సీ చ దివిన ఆమె.. జెనెటిక్స్ అండ్ ప్లాంట్ బ్రీడింగ్ లో సైంటిస్ట్ గా ఎంపి కైంది. ప్రస్తుతం ఇక్రిశాట్ లో పీహెచ్ డీ చేస్తోంది. జాతీయ స్థాయిలో వ్యవసాయ శాస్త్రవేత్త రిక్రూట్ మెంట్ బోర్డులో జాతీయ స్థాయిలో మొదటి భహుమతి పొందింది అశ్విని.




ఉన్నత లక్ష్యంతో పదిమంది అన్నం పెట్టే యువ సైంటిస్ట్ ఎదుగుతున్న సమయంలో ఆకేరు వరద లో చిక్కుకొని బలికావడంతో అశ్వినీ కుటుంబ సభ్యులు గుండె లు పగిలేలా ఏడ్చారు. అశ్వినీ తండ్రి జాడ ఇంకా తెలియలేదు.. ఒకే కుటుంబంలో ఇద్దరు మృతిచెందడంతో అశ్వినీ సొంత గ్రామం గంగారాం తండాతో విషాద ఛాయలు అలముకొన్నాయి.

# గూగుల్ నుంచి 4 ఇండియన్ సంస్థలకు ఫండ్స్




న్యూఢిల్లీ: గూగుల్ నుంచి నాలుగు ఇండియన్ ఆర్గనైజేషన్లు గ్రాంట్ పొందాయి. ఆసియా పసిఫిక్ రీజియన్ నుంచి మరో 14 ఆర్గనైజేషన్లు ఈ ఛాన్స్ దక్కించుకున్నాయి. సస్టయినబిలిటీ సీడ్ ఫండ్ 2.0 కింద 5 మిలియన్ డాలర్ల గ్రాంట్‌ను గూగుల్.ఆర్గ కేటాయించింది. సామాజిక, పర్యావరణ సమస్యలను తీర్చేందుకు ఏఐ ఆధారిత పరిష్కారాలను ఏషియన్ వెంచర్ ఫిలాంత్రపీ నెట్‌వర్క్ (ఏవీపీఎన్) వెతుకుతోంది.

ఇండియా నుంచి ఐఆన్ఆర్ఈఎం ఫౌండేషన్, సీఈపీటీ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఫౌండేషన్ (సీఆర్‌డీఎఫ్), ఇన్‌స్టిట్యూట్ ఫర్ ఫైనాన్షియల్ మేనేజ్‌మెంట్ అండ్ రీసెర్చ్, గుజరాత్ మహిళా హౌసింగ్ సేవా ట్రస్ట్ (ఎంహెచ్‌టీ) గ్రాంట్ పొందాయి.

# ఏపీలో వర్ష బీభత్సం.. నిలిచిపోయిన తమిళనాడు ఎక్స్‌ప్రెస్



బంగాళాఖాతంలో ఏర్పడ్డ వాయుగుండం బలదపడటంతో తెలుగు రాష్ట్రాలను భారీ వర్షాలు ముంచెత్తుతున్నాయి. రెండురోజులుగా ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలకు చాలాచోట్ల వాగులు ఉప్పొంగి రాకపోకలు నిలిచిపోయాయి. ఈ క్రమంలో ఎన్టీఆర్ జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాల కారణంతో తమిళనాడు ఎక్స్‌ప్రెస్ నిలిచిపోయింది. చెన్నై నుంచి న్యూఢిల్లీ వెళ్తున్న తమిళనాడు ఎక్స్‌ప్రెస్ రాయపాడు వద్ద నిలిచిపోయింది.

రైల్వే ట్రాక్ పైకి నీళ్లు చేరటంతో రైలు నిలిచిపోయినట్లు తెలుస్తోంది. ట్రాక్ పై పూర్తిగా నీళ్లు ఉండడంతో సహాయక చర్యలు ఆటంకం కలుగుతోంది. రాయపాడు వద్ద బుడమేరు కాలువ ఉధృతంగా ప్రవహిస్తోంది, సహాయక చర్యలు అందించేందుకు రాయనపాడు రైల్వే స్టేషన్ దగ్గరికి వెళ్లలేని పరిస్థితి ఏర్పడిందని సమాచారం. రైల్వే అధికారులు ఎన్టీఆర్ఎఫ్ సిబ్బంది కోసం వేచి చూస్తున్నారని సమాచారం.

# జలదిగ్బంధంలో ఖమ్మం.. డ్రోన్ విజువల్స్



ఎడతెరిపిలేని వానలు..పొంగిపొర్లుతున్న నదులు, వాగులు, చెరువులు..గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు కాలనీలన్నీ నీటి మునిగాయి. ఎక్కడ చూసినా నీళ్లే..ఇండ్లలో మోకాల్లోతు నీళ్లు.. చెరువులను తలపిస్తున్న కాలనీలు..పాలేరు వాగు ఉగ్రరూపం..చెరువుల్లా కాలనీలు..విరిగిన పడినచెట్లు..కొట్టుకుపోతున్న ప్రజలు.. ఇదీ ఆదివారం నాటి ఖమ్మ పట్టణం దుస్థితి.. డ్రోన్ ద్వారా తీసిన విజువల్స్.. భారీ వర్షాలకు ఖమ్మం పట్టణ పరిస్థితికి అద్దంపడుతున్నాయి.

గత మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు ఖమ్మం జిల్లాలో మున్నేరు వాగు ఉగ్ర రూపం దాల్చింది. ప్రకాశ్ నగర్ వద్ద డేంజర్ లెవల్లో మున్నేరు ప్రవహిస్తోంది. దీంతో ఖమ్మం పట్టణంలోని ఇండ్లలోకి భారీగా వరద నీరు వచ్చి చేరింది. ఇళ్ల మధ్య నుంచి మున్నేరు వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది.. పలు గ్రామాలకు రాకపోకలు బంద్ అయ్యాయి. దీంతో ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ప్రకాశ్ నగర్ వద్ద మున్నేరు వాగు గోదావరి నదిని తలపిస్తోంది. మున్నేరు వాగు ఉధృతంగా ప్రవహిస్తుండంతో ఖమ్మం జిల్లా కూసుమంచి మండలం నాయికన్ గూడెం వద్ద ముగ్గురు యువకులు వరదల్లో చిక్కుకున్నారు. సిమెంట్ బ్రిక్స్ తయారీ కేంద్రం ఉన్నా ఇల్లును వరద చుట్టుముట్టడంతో ముగ్గురు యువకులు ఇంటిపైకి ఎక్కారు. బాధితులతో మాట్లాడిన పొంగులేటి..వారికి ధైర్యం చెప్పారు. హెలికాప్టర్లు పంపించేందుకు ప్రయత్నించారు..కానీవాతావరణ సహకరించ కపోవడంతో సాధ్యం కాలేదు.. అయితే డ్రోన్ ద్వారా బాధితులకు సేఫ్టీ జాకెట్లు పంపించారు.అయితే ఇంతలోనే వరద ఉధృతి పెరిగి ఇంటి గోడ కూలిపోయిందని మంత్రి పొంగులేటి మీడియాతో చెప్పారు.. లైఫ్ జాకెట్లు ఉన్నాయి.. వారు క్షేమంగా బయటికి రావాలని కోరుకుంటున్నానని కంటనీరు పెట్టుకున్నారు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి.

# నాయకన్ గూడెం విషాదం: కొడుకు బతికాడు.. భార్యభర్తలు కొట్టుకుపోయారు



భారీ వర్షం ఖమ్మం జిల్లా కూసుమంచి మండలంలోని నాయకన్ గూడెంలో తీవ్ర విషాదం నింపింది. పాలేరు వాగులో చిక్కుకున్న కుటుంబంలో దంపతులు గల్లంత య్యారు. ప్రవాహంలో కొట్టుకుపోతున్న మరో యువకుడుని స్థానికులు, పోలీసులు రక్షించారు.

లేరు అలుగు సమీపంలో ఉన్న సిమెంటు ఇటుకల తయారీ కర్మాగా రంలో ఓ కుటుంబం నివసిస్తోంది. పాలేరు జలాశయానికి ఆదివారం తెల్లవారుజాము నుంచి వరద పోటెత్తడంతో షేక్ యాకుబ్, భార్య సైదాబి, కుమారుడు షరీఫ్ వరదల్లో చిక్కుకుపోయారు. వరద ఉద్ధృతి పెరగడంతో ప్రవాహంలో గల్లంతయ్యారు. కొట్టుకుపోతున్న షరీఫ్‌ను స్థానికులు, పోలీసులు కాపాడారు. దంపతుల కోసం గాలింపు కొనసాగుతోంది.

మున్నేరు వాగు ఉధృతంగా ప్రవహిస్తుండంతో ఖమ్మం జిల్లా కూసుమంచి మండలం నాయికన్ గూడెం వద్ద ముగ్గురు యువకులు వరదల్లో చిక్కుకున్నారు. సిమెంట్ బ్రిక్స్ తయారీ కేంద్రం ఉన్నా ఇల్లును వరద చుట్టుముట్టడంతో ముగ్గురు యువకులు ఇంటిపైకి ఎక్కారు. బాధితులతో మాట్లాడిన పొంగులేటి.. వారికి ధైర్యం చెప్పారు. హెలికాప్టర్లు పంపించేందుకు ప్రయత్నించారు.. కానీ వాతావరణ సహకరించకపోవడంతో సాధ్యం కాలేదు.. అయితే డ్రోన్ ద్వారా బాధితులకు సేఫ్టీ జాకెట్లు పంపించారు.


అయితే ఇంతలోనే వరద ఉధృతి పెరిగి ఇంటి గోడ కూలిపోయిందని మంత్రి పొంగులేటి మీడియాతో చెప్పారు.. లైఫ్ జాకెట్లు ఉన్నాయి.. వారు క్షేమంగా బయటికి రావాలని కోరుకుంటున్నానని కంటనీరు పెట్టుకున్నారు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి.

# రేవంత్ రెడ్డి గారి కాన్సెప్ట్ ఇప్పటికైనా అర్థమైందా?: నాగబాబు

హైదరాబాదులో అక్రమ నిర్మాణాలపై హైడ్రా ఉక్కుపాదం

రేవంత్ రెడ్డి నిర్ణయం సాహసోపేతమన్న నాగబాబు

ఆయన చర్యలను అందరూ అభినందించాలంటూ ట్వీట్



హైదరాబాదులో అక్రమ నిర్మాణాలను నేలమట్టం చేస్తూ 'హైడ్రా' కదం తొక్కుతున్న సంగతి తెలిసిందే. దీనిపై సినీ నటుడు, జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి కొణిదెల నాగబాబు స్పందించారు. వర్షాలు పడి తూములు తెగిపోయి, చెరువులు, నాలాలు ఉప్పొంగి అపార్ట్ మెంట్ లలోకి కూడా నీళు రావడం, కొన్ని సామాన్య ప్రాణాలు కూడా బలికావడం చాలా బాధాకరమని పేర్కొన్నారు. అందుకు ముఖ్య కారణం చెరువులను, నాలాలను కబ్జా చేసి అక్రమ నిర్మాణాలు చేయడమేనని నాగబాబు స్పష్టం చేశారు. "తెలంగాణ గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు చేపట్టిన హైడ్రా కాన్సెప్ట్ ఇప్పటికైనా అర్థమైందా? రేవంత్ రెడ్డి గారు తీసుకున్న సాహసోపేత నిర్ణయాన్ని, నిబద్ధతతో కూడిన చర్యలను మనమందరం అభినందిద్దాం. రేవంత్ రెడ్డి గారూ... మా సంపూర్ణ సహకారం మీకే" అంటూ నాగబాబు సోషల్ మీడియాలో స్పందించారు.

# రెడ్ అలర్ట్: హైదరాబాద్ లో అతిభారీ వర్షం పడే ఛాన్స్.. ఇళ్లలోనే ఉండండి.. బయటికి రావద్దు..




నాన్ స్టాప్ గా కురుస్తున్న వర్షాలతో తెలుగు రాష్ట్రాల్లో జనజీవనం స్తంభించిపోయింది.

రెండురోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో అటు ఏపీ, ఇటు తెలంగాణాలో చాలా చోట్ల వాగులు ఉప్పొంగి రాకపోకలు నిలిచిపోయాయి. ఇదిలా ఉండగా హైదరాబాద్ లో అతిభారీ వర్షాలు పడే అవకాశం ఉందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తెలిపింది వాతావరణ శాఖ. భారీ వర్షాలు కురిసే సమయంలో ప్రజలు ఇళ్లలోనే ఉండాలని, అత్యవసరమైతే తప్ప బయటకు రావద్దని హెచ్చరించింది వాతావరణ శాఖ.

ఈ క్రమంలో అతిభారీ వర్షాల నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసింది. జిల్లా కలెక్టర్లతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించిన ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సచివాలయంలో ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కంట్రోల్ రూమ్ ద్వారా వర్షాలు, వరదల పరిస్థితిని సమీక్షించనున్నట్లు తెలిపారు.

ప్రత్యేక కంట్రోల్ రూమ్ కోసం టోల్ ఫ్రీ నంబర్ 040 – 2345 4088 కూడా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వర్షాలు, వరదలపరిస్థితిని జిల్లా కలెక్టర్లతో ఎప్పటి కప్పుడు సంప్రదించి వారికి కావాల్సిన సహాయసహకారాలు, తగు సూచనలను ఈ కంట్రోల్ రూమ్ ద్వారా అందిస్తామని తెలిపారు.

# శ్రీశైలం ఘాట్ రోడ్లో విరిగిపడ్డ కొండచరియలు రాకపోకలు బంద్



శ్రీశైలానికి వెళ్లే ఘాట్ రోడ్డులో ఆదివారం కొండచరియలు విరిగిపడ్డాయి. దక్షిణ తెలంగాణ జిల్లాలైన ఉమ్మడి మహబూబ్ నగర్, నల్గొండ, ఖమ్మం భారీ వర్షాలు కురిశాయి. నాగర్ కర్నూలు జిల్లా అమ్రాబాద్ మండలం పాతాళ గంగ సమీపంలో శ్రీశైలం, దోమల పెంట ప్రధాన రహదారి ఘాట్ రోడ్డుపై కొండ చరియలు విరిగిపడ్డాయి. దీంతో ఫారెస్ట్ అధికారులు మన్ననూరు టోల్ గేట్ మూసివేశారు. శ్రీశైలం వైపు రాక పోకలు నిలిపివేసినట్లు అమ్రాబాద్ పోలీసులు తెలిపారు. ఘాట్ రోడ్డు సెక్షన్ లో భారీగా ట్రాఫిక్ జామ్ అయ్యింది. వన్ వే ఘాట్ సెక్షన్ కావడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు రోడ్డుపై పడ్డ పెద్ద బండరాళును తొలగిస్తున్నారు. పోలీసులు ట్రాఫిక్ క్లియర్ చేస్తున్నారు.

# రాష్ట్రవ్యాప్తంగా రెస్క్యూ ఆపరేషన్స్.. శ్రమిస్తున్న ఫైర్ సేఫ్టీ టీమ్స్



రాష్ట్రవ్యాప్తంగా వానలు దంచికొడుతున్నాయి. గత మూడు రోజులుగా ఎడ తెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు నదులు, చెరువులు, కుంటలు, వాగులు పొంగిపొర్లు తున్నాయి. భారీవర్షాలతో పలుప్రాంతాల్లో వరదల్లో చిక్కుకుని ప్రజలను తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ క్రమంలో తెలంగాణ ప్రభుత్వం అలెర్ట్ అయిం ది..ఎన్డీఆర్ఎఫ్, డీఆర్ఎఫ్, ఫైర్ సేఫ్టీ సిబ్బందిని, అధికారులను అప్రమత్తం చేసింది..రాష్ట్రవ్యాప్తంగా సహాయక చర్యలు చేపట్టారు.. వరదల్లో చిక్కుకున్న ప్రజలను రక్షించేందుకు శ్రమిస్తున్నారు.

మహబూబాబాద్ జిల్లా బీచరాజుపల్లి, మరిపెడ, బంగ్లాలో వరదనీటిలో చిక్కుకున్న 9మందిని ఫైర్ సిబ్బంది కాపాడింది.. సూర్యాపేట జిల్లా కోదాడలో కూడా పలు వురు కాపాడారు రెస్క్యూ టీం సభ్యులు. కోదాడ ఎల్ ఐసీ ఆఫీస్ మెయిన్ రోడ్, కోదాడ బ్రిడ్జి దగ్గర , షిర్డీ సాయినగర్ లో దాదాపు 150 మందిని కాపాడి సురక్షిత ప్రాంతా లకు చేర్చారు. కోదాడ పరిధిలోని తొగురై గ్రామంలో వరద నీటిలో ఆగిపోయిన కారులోంచి ఇద్దరు వ్యక్తులను రక్షించారు ఫైర్ సిబ్బంది. కోదాడ చెరువు లో వరదల్లో చిక్కుకుపోయిన ఇద్దరిని బోట్ల ద్వారా రక్షించారరు. మహబూబాద్ జిల్లాలో సూతరం తండా , ధర్మారంలో ఫైర్ డిపార్ట్ మెంట్ రెస్క్యూ టీం సక్సెస్ ఫుల్ పనిచేస్తోంది. సుమారు 100 మందిని సేఫ్ జోన్ కు తరలించారు. సీతారాం తండా, ధర్మారం గ్రామంలో సహాయక చర్యలు చేపట్టారు. మహబూబాబ్ జిల్లాలో వాగులు వంకలు పొంగిపొర్లుతుండటంతో ఫైర్ సిబ్బంది అలెర్ట్ అయింది. లోతట్టు ప్రాంత ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించడంతో శ్రమిస్తున్నారు ఫైర్ సిబ్బంది.

# రుబీనా కాంస్య గురి.. ఇండియా ఖాతాలో ఐదో మెడల్





పారిస్: పారాలింపిక్స్‌లో ఇండియాకు ఐదో పతకం లభించింది. మొన్న ఒలింపిక్స్‌లో ఇండియా షూటర్లు అదరగొట్టిన వేదికపై ఇప్పుడు పారా షూటర్లూ సత్తా చాటుతున్నారు. పోటీల రెండో రోజు షూటర్లు మూడు మెడల్స్ అందుకోగా.. మూడో రోజు షూటింగ్ నుంచి మరో పతకం వచ్చింది. ఎస్‌హెచ్1 విమెన్స్ 10 మీటర్ల ఎయిర్ పిస్టల్‌ఈవెంట్‌లో రుబీనా ఫ్రాన్సిస్ కాంస్య పతకం గెలిచింది. దాంతో పారాలింపిక్స్ పిస్టల్ విభాగంలో ఇండియాకు పతకం అందించిన తొలి మహిళగా రికార్డు సృష్టించింది.

శనివారం జరిగిన ఫైనల్లో ఫ్రాన్సిస్211.1 స్కోరుతో మూడో స్థానం సాధించింది. ఇరాన్ షూటర్ సారెహ్‌జవాన్మర్ది 236.8 స్కోరుతో గోల్డ్ నెగ్గగా, టర్కీకి చెందిన ఐసెల్ ఒజ్గాన్ 231.1 స్కోరుతో సిల్వర్ ఖాతాలో వేసుకుంది. అయితే, ఎస్‌హెచ్1 (స్టాండింగ్) మెన్స్10 మీటర్ల రైఫిల్‌లో 38 ఏండ్ల వెటరన్ షూటర్ స్వరూప్‌ఉన్హాల్కర్ క్వాలిఫికేషన్ రౌండ్‌లో స్వరూప్ 613.4 స్కోరుతో 14వ స్థానంతో సరిపెట్టాడు.

**వైల్డ్ కార్డుతో వచ్చి..**

ఇండియా టీమ్ పారిస్‌కు బయల్దేరే ముందు బైపార్టీ (వైల్డ్‌కార్డ్) ద్వారా అనూహ్యంగా పారాలింపిక్స్‌బెర్తు దక్కించుకున్న 25 ఏండ్ల రుబీనా క్వాలిఫికేషన్‌రౌండ్‌తో పాటు ఫైనల్లోనూ అద్భుత పోరాట పటిమతో మెడల్ అందుకుంది. ఓ దశలో తను ఫైనల్ చేరడం గొప్పే అనిపించింది. క్వాలిఫికేషన్ రౌండ్‌లో తొలి సిరీస్‌పది షాట్స్ తర్వాత 14వ స్థానానికి పడిపోయింది. ఆ తర్వాత టార్గెట్‌ను గురి చూసి కొట్టిన తను 556 స్కోరుతో ఏడో ప్లేస్‌తో ఫైనల్ చేరింది. టాప్8 షూటర్లు పోటీ పడ్డ తుదిపోరులో ఆమె మెరుగ్గా ఆడింది. పది షాట్ల తొలి సిరీస్ తర్వాత 106.5 స్కోరుతో మూడో స్థానంలో నిలిచింది. ఎలిమినేషన్ సిరీస్ మొదలైన తర్వాత కాస్త ఇబ్బంది పడింది.

11-%-%14 షాట్లలో 8.9, 9.3, 8.7, 9.8 పాయింట్లు మాత్రమే రాబట్టి నాలుగో స్థానానికి పడిపోయింది. కానీ, తర్వాతి రెండు షాట్లలో 9.7, 10.4 పాయింట్లతో తిరిగి టాప్-%-%3లోకి వచ్చింది. 19, 20వ షాట్లలో ఒజ్గాన్ 8.2, 8.9 పాయింట్లు మాత్రమే రాబట్టగా.. రుబీనా 9.5, 9.8 పాయింట్లతో మొత్తంగా 211.1 స్కోరుతో రెండో ప్లేస్‌కు దూసుకొచ్చి సిల్వర్‌పై ఆశలు రేపింది. కానీ, తర్వాతి రెండు షాట్లలో 9.2, 8.9 పాయింట్లు మాత్రమే చేసిన ఇండియా షూటర్ మూడో స్థానంతో పోరు ముగించింది.

**సెమీస్‌లో నితేశ్, సుకాంత్**

షట్లర్లు నితేశ్ కుమార్, సుకాంత్ కదమ్‌సెమీస్ చేరుకున్నారు. మెన్స్ సింగిల్స్ ఎస్ఎల్3 కేటగిరీ గ్రూప్%-%ఎ మ్యాచ్‌లో నితేశ్ 21%-13, 21-%14తో బున్సున్ (థాయ్‌లాండ్)ను ఓడించాడు. గ్రూప్‌లో టాప్ ప్లేస్‌తో నితేశ్ సెమీస్‌లో అడుగుపెట్టాడు. ఎస్ఎల్4 గ్రూప్%-%బి మ్యాచ్‌లో సుకాంత్ 21%-12, 21-%12తో సిరపాంగ్ (థాయ్‌లాండ్)పై నెగ్గి ముందంజ వేశాడు. సెమీస్‌లో అతను సుహాస్ య తిరాజ్‌తో తలపడనున్న నేపథ్యంలో ఇండియాకు పతకం ఖాయమైంది. మరోవైపు మన్‌దీప్ కౌర్ విమెన్స్ ఎస్ఎల్3 కేటగిరీ గ్రూప్%-%బి చివరి మ్యాచ్‌లో మన్‌ప్రీత్ కౌర్ 21%-23, 21-10, 21-%17తో వినోట్ (ఆస్ట్రేలియా)పై గెలిచి క్వార్టర్స్ చేరింది.

**అర్షద్, జ్యోతికి నిరాశ**

సైక్లింగ్ ఈవెంట్లలో ఇండియా సైక్లిస్టులు అర్షద్ షేక్, జ్యోతి గదేరియా క్వాలిఫికేషన్ రౌండ్లలోనే ఇంటిదారి పట్టి నిరాశపరిచారు. మెన్స్1000 మీటర్ల టైమ్ ట్రయల్ సి1%-%3 ఈవెంట్‌లో అర్షద్ (1:21.416 సె) చివరి, 17వ స్థానంతో సరిపెట్టాడు. విమెన్స్500 మీటర్ల టైమ్ ట్రయల్ సి1%-%3 క్వాలిఫికేషన్ రౌండ్‌లో జ్యోతి (49.233సె) 11వ ప్లేస్‌లో నిలిచి ఫైనల్ చేరలేకపోయింది. రోయింగ్‌లో ఏపీకి చెందిన నారాయణ, అనిత మిక్స్‌డ్‌పీఆర్3 డబుల్స్‌స్కల్స్‌రెపిచేజ్‌లో నిరాశపరిచి పతక రౌండ్‌కు అర్హత సాధించలేకపోయారు.

**ఆర్చర్లు ఇంటిదారి**

ఆర్చరీలో ఇండియాకు ప్రతికూల ఫలితాలే వచ్చాయి. రెండు చేతులు లేకుండా ఆర్చరీ ఆడుతున్న తొలి పారా ఆర్చర్‌శీతల్ దేవి ఒక్క పాయింట్ తేడాతో ప్రిక్వార్టర్స్‌లో ఓడగా.. సరితా కుమారి క్వార్టర్ ఫైనల్లో పరాజయం పాలైంది. వరల్డ్ నం.2 శీతల్ విమెన్స్ ఆర్చరీ కాంపౌండ్ ప్రిక్వార్టర్స్‌లో 137%-%138తో చిలీకి చెందిన జునిగా చేతిలో ఓడింది. క్వార్టర్స్‌లో సరిత 140%-%145తో టర్కీ ఆర్చర్ గిర్డి ఒంజుర్ చేతిలో చిత్తయింది.

# ఢిల్లీ ప్రీమియర్ లీగ్.. సిక్సర్ల వర్షం కురిపించిన ఆయుష్ బదోనీ





న్యూఢిల్లీ: ఐపీఎల్‌తో వెలుగులోకి వచ్చిన యంగ్ క్రికెటర్‌ఆయుష్ బదోనీ, మరో కుర్రాడు ప్రియాన్ష్‌ఆర్య ఢిల్లీ ప్రీమియర్ లీగ్‌లో సిక్సర్ల మోత మోగించారు. సౌత్ ఢిల్లీకి ఆడుతున్న బదోనీ టీ20 మ్యాచ్‌లో అత్యధికంగా 19 సిక్సర్లు కొట్టి రికార్డు సృష్టించగా.. ఆర్య ఆరు బాల్స్‌కు ఆరు సిక్సర్లు కొట్టి ఔరా అనిపించాడు. శనివారం జరిగిన మ్యాచ్‌లో బదోనీ ( 55 బాల్స్‌లో19 సిక్సర్లు, 8 ఫోర్లతో 165), ఆర్య (50 బాల్స్‌లో 10 సిక్సర్లు, 10 ఫోర్లతో 120) మెరుపు సెంచరీలతో రెండో వికెట్‌కు 286 రన్స్ జోడించాడు. టీ20ల్లో ఏ వికెట్‌కైనా ఇదే హయ్యెస్ట్ పార్ట్‌నర్‌షిప్. వీళ్ల జోరుకు 308/5 స్కోరు చేసిన సౌత్ ఢిల్లీ 112 రన్స్ తేడాతో నార్త్ ఢిల్లీ స్ట్రైకర్స్‌ను చిత్తు చేసింది.

# తండ్రికి తగ్గ తనయుడు.. అండర్ - 19 టీమ్‌లో చోటు దక్కించుకున్న సమిత్ కొడుకు



న్యూఢిల్లీ: టీమిండియా లెజెండరీ క్రికెటర్, మాజీ కోచ్ రాహుల్ ద్రవిడ్ కొడుకు సమిత్ ద్రవిడ్ తండ్రి బాటలో నడుస్తున్నాడు. కర్నాటక స్టేట్ క్రికెట్‌లో దుమ్మురేపి మంచి పేరు తెచ్చుకున్న సమిత్.. ఇండియా అండర్%-%19లోకి వచ్చాడు. ఈ నెలలో ఆస్ట్రేలియా అండర్%-%19 జట్టుతో జరిగే వన్డే, అనధికార టెస్టు సిరీస్‌ల్లో పోటీపడే ఇండియా టీమ్‌కు అతను ఎంపికయ్యాడు. పేస్ బౌలింగ్ ఆల్‌రౌండర్ అయిన 18 ఏండ్ల సమిత్ కర్నాటక జట్టు కూచ్ బెహార్ ట్రోఫీ నెగ్గడంలో కీలక పాత్ర పోషించాడు. ఈ నెల 21, 23, 26వ తేదీల్లో పుదుచ్చేరి వేదికగా మూడు వన్డేల సిరీస్ జరుగుతుంది. యూపీకి చెందిన మొహమ్మద్ అమాన్ ఈ సిరీస్‌లో ఇండియా టీమ్‌కు కెప్టెన్‌గా ఎంపికయ్యాడు. అనంతరం చెన్నై వేదికగా జరిగే నాలుగు రోజుల మ్యాచ్‌ల్లోనూ ఆసీస్‌తో ఇండియా పోటీ పడనుంది. ఈ టీమ్‌ను మధ్యప్రదేశ్‌కు చెందిన సోహమ్ పత్వార్ధన్ నడిపిస్తాడు.

# బుట్టబొమ్మ 2.ఓ..మత్తెక్కిస్తోన్న బ్యూటీ!





ఆమ్నా షరీఫ్ మనోహరమైన భంగిమలు



బీచ్‌లో పూజా భాలేకర్ లుక్స్ దవడ పడిపోయాయి

బుట్టబొమ్మ అంటే అందరికీ ఠక్కున గుర్తొచ్చేది పూజాహెగ్డే. బుట్టబొమ్మ పాటతోనే కాదు...ఆ పాటలో వాడిన కాస్ట్యూమ్స్ తోనూ అమ్మడు ఎంతో హైలైట్ అయింది. బుట్టబొమ్మకి రూపం అంటూ ఉంటే? అది ఇలాగే ఉంటుందా? అన్న అందంగా సరితూగింది పూజాబ్యూటీ. దీంతో బుట్టబొమ్మ ట్యాగ్ పూజాహెగ్డే ఇంటి పేరులా మారిపోయింది. తాజాగా బుట్టబొమ్మకి 2.ఓ లా దిగింది మౌనీరాయ్ అలియా నాగిని. బ్రౌన్ కలర్ షోల్డర్ లెస్ గౌనులో అమ్మడు వీపందాన్ని ఓ రేంజ్ లో హైలైట్ చేసింది. వీపందం నుంచి థై అందం వరకూ నాగిని హైలైట్ చేయడంలో ఎక్కడా తగ్గలేదు. తనదైన మార్క్ ఎలివేషన తో చూపరులను ఆకట్టుకుంటుంది. అమ్మడి పోలికలు కూడా పూజాహెగ్డేకి సమీపంగానే ఉంటాయి. ఇక కామెంట్ బాక్సులో పోస్టుల కైతే కొదవలేదు . నాగిని అందాన్ని పొగిడేస్తూ తమదైన శైలిలో పోస్టులు పెడుతున్నారు. ఇక కెరీర్ పరంగా తిరుగు లేకుండా దూసుకుపోతుంది. ప్రస్తుతం ఈ బ్యూటీ బాలీవుడ్ లో వరుసగా అవకాశాలు అందుకుం టుంది. మునుపటి కంటే మరింత వేగంగా పనిచేస్తోంది. గత ఏడాది ఖాళీగా ఉన్నా 2024 లో మాత్రం నాలుగైదు కమిట్ మెంట్లతో కనిపిస్తుంది. ఆ మధ్య బ్లాకౌట్ అనే సినిమాతో ప్రేక్షకుల ముందుకొచ్చింది. ఇటీవలే రిలీజ్ అయిన జాన్ అబ్రహం %-%వేద%-%లోనూ స్పెషల్ అప్పిరియన్స్ తో అలరించింది. ఆ సినిమా ఫ్లాప్ అయినా మౌనీ రాయ్ పెర్ఫార్మెన్స్ కి మంచి మార్కులు పడ్డాయి. ప్రస్తుతం ఆమె నటిస్తోన్న మరో రెండు చిత్రాలు ఆన్ సెట్స్ లో ఉన్నాయి.

On behalf of Printed, Published and owned by GANTYADA APPA RAO, D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh. Printed At SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh.
Editor: G.APPARAO, Mobile : 9059465965, RNI : APTEL/2014/58046, e-mail:penpower9@gmail.com